మీ కళ్ళకు కనిపించని నిజాలు ఎన్నో ఉన్నాయి. ఆత్మ, చైతన్యం అంటే మీరు బుజ్జిగాడు, బుజ్జిగాడు అనుకోకండి పెద్దగోడ మీద చిన్న చిలకబొమ్మ వేసాము అనుకోండి ఆ బొమ్మ గోడ అంతా ఉండదు. గోడలో కొంత భాగంలో ఉంటుంది. అలాగే విశాలమైన చైతన్యంలో, ఆత్మలో ఈసూర్యుడు, ఈచంద్రుడు, ఖండాలు, ఈసృష్టి అంతాకూడా కొంత భాగం మాత్రమే ఉంటుంది. భగవాన్ అంటూ ఉండేవారు మీకు ఎంతసేపు క్రియేషన్ గొడవేకాని క్రియేటర్ గొడవలేదు. అనేవారు. ఇతరులలో ఉన్న దోషాలను చూడవద్దు అప్పుడు ప్యూరిటీ పెరుగుతుంది. ఇతరులలో ఉన్నదోషాలు చూడడం భగవంతుడు పాపులకు అప్పగించాడు. మీరు భక్తులు కదా ఆ గొడవ మీకు ఎందుకు ? ఇతరులలో ఉన్న దోషాలను చూడటం ఎప్పుడైతే మానివేసారో అప్పుడు భక్తి పెరుగుతుంది. భక్తి ఎప్పుడైతే పెరిగిందో మీరు కొంచెం కొంచెం ఆత్మవైపుకు జరుగుతూ ఉంటారు. అప్పుడు మీకు ఆత్మానుభవం కలుగుతుంది.

జ్ఞానం అంటే గీతలో నాలుగు శ్లోకాలు కంఠస్తం చేయటం జ్ఞానంకాదు. మహాత్ములు చెప్పిన నాలుగు మాటలు కంఠస్తం చేయటం జ్ఞానం కాదు. ఇవి అన్నీ మనస్సుకు సంబంధించినవి. నీ హృదయంలో ఉన్న వస్తువు అనుభవంలోనికిరావటం జ్ఞానం. ఇప్పుడు నీకు దేహం ఏవిధంగా అయితే అనుభవంలో ఉందో అలాగే నీ హృదయంలో ఉన్న సద్వస్తువు నీకు అనుభవంలోనికి రావటం జ్ఞానం.

## (పెన్నాడలో శ్రీనాన్నగారి ప్రవచనము, 8-1-98)

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

ఆత్మ మనహృదయంలో ఉంది. మన మనస్సును తీసుకొని వెళ్ళి ఆత్మలో నిలబెట్టి అందులో మనస్సు కరిగిపోయేవరకు చూస్తాడు వాడు గురువు, వాడు ఆచార్యుడు. తాను బోధిస్తూ, తానుభోదించినది తాను ఆచరిస్తూ, మిమ్మల్ని కూడా ఆచరింపచేసేవాడు ఆచార్యుడు. తను ఏవస్తువు గురించి బోధ చేస్తున్నాడో ఆవస్తువు మీ చేతికి అందేటట్లు చేసేవాడు ఆచార్యుడు. ఇప్పుడు మీ శరీరం ఎక్కడ ఉంటే అక్కడ మీరు ఉన్నారు అనుకొంటున్నారు. మీరు శరీరమే అయితే మీరు పెన్నాడలో ఉన్న మాట నిజం. మీరు శరీరం అనుకొన్నప్పుడు మీరు ఆత్మగానే ఉన్నారు. మీరు మనస్సు అనుకున్నప్పుడు మీరు ఆత్మగానే ఉన్నారు, కాని మీ మనస్సులో ఉన్న వికారముల వలన, మీరు ఆత్మ అన్న సంగతి మీకు తెలియటం లేదు. మీరు ఆత్మ అయినప్పటికి మీరు మనస్సుగా ఉండటం వలన, దేహంగా ఉండటం వలన, వికారములు వస్తున్నాయి. ఆవికారముల వలన బయట విషయాలకు ఆకర్షింపబడుతున్నారు. బయట ఏమీ లేదు. అంతా లోపలే ఉంది. లోపల ఉన్నదే బయట కనిపిస్తుంది. మీలో బలహీనత లేకపోతే, చెడులేకపోతే ప్రపంచంలో చెడు ఉన్నా నిన్ను ఆకర్షించదు. నీలో మంచి ఉంటే బయట ఉన్న చెడు నిన్ను ఆకర్షించదు.

పక్షులుగాలిలో ఎగురుతున్నాయి, చేపలు నీటిలో ఈదుతున్నాయి, మనుషులు భూమిమీద తిరుగుచున్నారు. మనకు జ్ఞానంలేకపోతే పక్షులు ఎంతో, చేపలుఎంతో మనంకూడా అంతే, వాటికి

మనకుబేధంలేదు. మనంఎవరో మనం తెలుసుకోవటంముఖ్యం. ఇప్పడుపదైతే నేను,నేను అంటున్నానో అది అబద్ధమైననేను. దానికే కోరికలు వస్తున్నాయి. కోరికలు వచ్చే ఈనేను ఎవరు అని ప్రశ్నించుకొని, దానిని వెంటాడి, అది ఎక్కడపుడుతోందో అక్కడకు తీసుకొనివెళితే అక్కడఅదికరిగిపోతుంది. అబద్ధమైననేను కరిగిపోతే నీవుపోవు. నీవు చైతన్యంగా, ఆత్మగా మిగులుతావు. కొంతసాధన చేసిన తరువాత బాహ్యమైన ఆకర్షణలకు లోబడికొంతమంది పడిపోతారు. అంతిమస్థితికి, పరమస్థితికి చేరుకొనే వారు బహుకొద్దిమంది మాత్రమే ఉంటారు. బహుజన్మల కృషివలన మాత్రమే ఆస్థితిని పొందగలము. మాకు అజ్ఞానం ఉంది అది పోగొట్టుకోవటం ఎలాగ అని ప్రశ్నిస్తున్నారు. అజ్ఞానం ఎవరికి ఉంది! అబద్ధమైననేనుకు అజ్ఞానం ఉంది. అజ్ఞానమునకు ఏనేను అయితే ఆధారంగా ఉందో ఆనేనును తీసివేస్తే అజ్ఞానంలేదు. నీవు ఎవరో నీకు తెలియకపోవటమే అజ్ఞానం. నీవు ఎవరో నీకు తెలియకుండా ఏనేను అయితే అడ్డువస్తోందో దానిని తీసివేయటమే సాధన యొక్క ప్రయోజనం.

గాఢనిద్రలో పరిమితులు లేవు. జాగ్రదావస్థలో పరిమితులు వస్తున్నాయి. ఎందుచేత అంటే గాఢనిద్రలో మనస్సులేదు. జాగ్రదావస్థలో మనస్సువస్తోంది. మనస్సుఉంటే పరిమితులువస్తాయి, మనస్సు లేకపోతే పరిమితులులేవు. సంకల్పాలు, కోరికలు, రాబోయే జన్మకు కారణములు అన్ని మనస్సులో ఉన్నాయి. మనస్సు అణిగిపోతే అన్ని అణిగిపోతాయి. ఈమనస్సునశిస్తే నీలోపల ఉన్న ఆనందమే స్వయంగా నీకు వ్యక్తమవుతుంది. అయితే ఈమనస్సునశించటానికి ఎవరూసాధనలు చేయటంలేదు. మనకుఎంతసేపు దేహంగొడవ తప్ప మనస్సు గొడవ ఎవరికీ లేదు. అందరికి శారీరకఆరోగ్యం గొడవ తప్ప మానసికఆరోగ్యం గురించి ఎవరూ పట్టించుకోవటం లేదు. కొంతమంది ప్రతీ చిన్నవిషయానికి ఉద్రేకపడతారు అంటే మానసిక ఆరోగ్యం సరిగాలేదు అనిఅర్థం. ధ్యానంచేసి, విచారణచేసి, పూజచేసి మనస్సును లోపలకు గెంటుదామని చూస్తున్నాము. అదిలోపలకు వెళ్ళటంలేదు, బయటకు వచ్చేస్తోంది. మనలో అహంకారం ఉన్నంత సేపు ఎన్నిసాధనలు చేసిన మనస్సు హృదయంలో ఉండదు. అహంకారం దానిని బయటకు లాగుకొని వచ్చేస్తుంది.మనం అహంకారమును విడిచిపెట్టటానికి సిద్ధంగాలేము. మనస్సులోపల ఉంటడంలేదు అంటారు విడిచిపెట్టవలసిన వస్తువును విడిచిపెట్టటానికి మనం సిద్ధంగా ఉంటేకదా అది లోపలఉండటం. ఒకటి మర్చిపోవద్దు. నీదేహంచనిపోయినా, ప్రపంచం కనబడకపోయినా, నీకోరికలు కనబడకపోయినా, గుడులు, గోపురాలు, నీ ఇష్టాలు అయిష్టాలు కనబడకపోయినా ఈగొడవలు అన్నీ లేకపోయినా నీవు ఉన్నావుఅన్నసంగతి నీవు మర్చిపోకు. ఇంక నీవు భయపడతావు ఎందుకు! దేహంలేకుండా, మనస్సు లేకుండా, దేవుడు గొడవలేకుండా నీవు ఉంటావు. ఈగొడవలు లేకుండా నీవు ఉండగలవు. ఇవిఅన్నీ లేకపోతే నీవు ఉండవేమోనని నీకు భయంకలుగుతోంది. అది నీతెలియనితనం. ఇవి అన్ని లేకపోయినా నీవు ఉంటావు. గాఢనిద్రలో ఎలా ఉన్నావో జాగ్రదావస్థలో కూడా అలా జీవించగలిగితే ఈమనస్సు నశిస్తుంది. కాని అహంకారము అలా నశించటానికి ఒప్పకోదు. అందువలన హృదయంలో ఉన్నవస్తువునీకు తెలియటంలేదు. పూజలు, జపాలు, ధ్యానాలు

చేస్తున్నాము. కాని అహంకారమును విడిచిపెట్టటానికి ఎవరూ సిద్ధంగా లేరు. అందుచేత ఈ మనస్సు నశించే సమస్యలేదు అంటున్నారు భగవాన్.

నీమనస్సును పవిత్రం చేసుకో, ఏకాగ్రంచేసుకో. నిరాడంబరముగా జీవించు. మనస్సు ఎప్పుడైతే పవిత్రం అయిందో, ఏకాగ్రం అయిందో అదే ఆత్మాకారం చెందుతుంది. మనస్సే ఆత్మ అయిపోతుంది. అప్పుడు గురువు అయిపోతావు, జ్ఞానివి అయిపోతావు. అప్పుడు ఆనందమే ఆనందం, ఎటుచూసినా ఆనందమే. చావు పుట్టకలు అర్థం లేనిమాటలు అని దేహానికి సంబందించిన మాటలు అని నీకు తెలుస్తుంది. ధ్యానం అంటే మీకు ఇష్టమైన భగవంతుని మీద నీమనస్సును నిరంతరం నిలబెట్టి ఉంచటం. ఇది ఇతర తలంపులు రాకుండా చేస్తుంది. ధ్యానం చేసేటప్పుడు ఇతర తలంపులు వచ్చినా వెనక్కి వెళ్ళిపోతాయి. వాటికి food supply ఆగిపోతుంది. ధ్యానం చేయగా చేయగా ఒకే భావన మిగులుతుంది. మీరు ఉపాసించే దేవుడు అనుభవంలోనికి వచ్చాక ఆభావనకూడా తప్పకొంటుంది. నీ మనస్సు అటూ, ఇటూ వెళుతూ ఉంటే లోపల దోషం ఉన్నట్లు గుర్తు. ఏకారణం వలన మనస్సు చలిస్తోందో చూసుకోండి. ఆ కారణం తొలగించుకొంటే మనస్సుయొక్క చాపల్యం ఆగిపోతుంది. ఆంజనేయస్వామి సీతను వెతకటానికి లంకకు వెళ్ళినప్పుడు రావణాసురుడు అంతఃపురంలో సీత ఎక్కడయినా ఉందేమో అని అంతఃపురం అంతా చూసాడు. అక్కడ రకరకాల వస్తువులు, రకరకాల మనషులు కనిపించారు, ఎక్కడ ఆయనకు వికారము కలుగలేదు. ఆయన భక్తుడు, అంటే. రాముడు తప్పించి ఆయన హృదయంలో ప్రపంచం లేదు.

ఏక మక్షరం హృది నిరంతరం భాసతే స్వయం లిఖ్యతేకథం

సత్యవస్తువు నీ హృదయంలో ఉంది. అది నాశనం కానిది. అది ఒక్కటిగానె ఉంది, ఏకంగా ఉంది. సర్వకాల సర్వావస్థలలో నీ హృదయంలోనే ఉంది. అది ఉంది అని తెలియటానికి బయట వెలుతురు సహాయం అక్కరలేదు. అది ఉండటం వలననే అది తెలియబడుతుంది. అటువంటి వస్తువు గురించి ఎవరు చెప్పగలరు, ఎవరు వ్రాయగలరు. అది మనస్సుకు, మాటకు అందదు, మనస్సుకు అందని విషయం గురించి చెప్ప, చెప్ప అంటే ఎవరు చెప్పగలరూ ఆవస్తువును అనుభవించాలి గాని నోటితో దాని గురించి చెప్పలేము. ఆ వస్తువు అనుభవానికి వచ్చినప్పుడు ఇట్టిదికదా అని నీకు తెలుస్తుంది. కాలానికి అతీతమైనవాడు కాలంలోనికి వచ్చి బోధిస్తాడువాడు దేవుడు. మనల్లను ఉద్దరించటం కోసం ఆయన స్వరూపం మనకు ఇవ్వటం కోసం కాలతీతమైన వస్తువు కాలంలోనికి వచ్చి మనకు బోధించి మరుగవుతుంది. వాడే గురువు.